

5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, మే 2: జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 5, 6 తేదీలలో సంబంధిత ఆర్వో కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఫారం-12, ఫారం 12బి ద్వారా 16,571 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉన్నట్లు వెల్లడించారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన 3,449 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 585 మంది అత్యవసర సర్వీసుల వారు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేకపోయిన జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు, ఎన్నికల విధులకు జారీ చేసిన ఉత్తర్వు కాపీలను ఆయా ఆర్వో కేంద్రాల్లో చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని పేర్కొన్నారు. హోమ్ ఓటింగ్‌కు అర్హత కలిగిన 566 మంది ఈనెల 6, 7 తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఇచ్చామన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

చిత్తూరు : పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్ల(సూక్ష్మ పరిశీలకులు) పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అన్నారు. గురువారం నాగయ్య కళాక్షేత్రంలో మైక్రో అబ్జర్వర్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నారు. 425 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, నిరంతర వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. సాధారణ పరిశీలకులు సాధిక్ ఆలం, కైలాస్ వాంఖడే, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.



పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె సప్తగిరి బ్యాంకు వద్ద పెన్షన్ కోసం పడిగాపులు



సోమల పెద్దఉప్పరపల్లె సప్తగిరి బ్యాంకు వద్ద..

పెన్షన్‌దారులతో జగనన్న రాక్షస క్రీడ

- బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు
- కార్వేటినగరంలో వడదెబ్బకు ఒకరి మృతి
- చాలామందికి బ్యాంకుల్లో సొమ్ము పడక వెనుతిరిగిన వైనం

చిత్తూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీపై జగన్ ప్రభుత్వం పన్నిన పన్నాగం వల్ల వృద్ధులు, వికలాంగులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. మండుటెండలో బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకులకు వచ్చిన వృద్ధులు, వికలాంగుల్లో చాలా మందికి తమ ఖాతాల్లో పెన్షన్ సొమ్ము జమ కాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఇంటింటికీ పెన్షన్లు పంపిణీ చేస్తే వలంటీర్లు ప్రభావితం చేస్తారని ఎన్నికల సంఘం మాజీ సీఈవో రమేష్ కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయంగా సరిపడా సచివాలయ ఉద్యోగులున్నా జగన్ ప్రభుత్వం సచివాలయాల వద్దే పెన్షన్ పంపిణీ చేసి, నెపం ప్రతిపక్షాల మీద నెట్టింది. ఏప్రిల్‌లో పెన్షన్ కోసం వెళ్లిన గుడిపాల మండలానికి చెందిన ఓ వృద్ధుడు ఎండ వేడిమి తాళలేక మరణించారు కూడా. ఈ నేపథ్యంలో టీడీపీ గట్టిగా పోరాడి ఇంటికే పెన్షన్ అందించాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. అయినా ప్రభుత్వం కుట్ర పన్ని కొందరికే ఇంటికి పంపిణీ చేసి, ఎక్కువ మందికి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. బుధవారం ఇంటింటికీ పెన్షన్లను పంపిణీ చేయగా గురువారం నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం ప్రారంభమైంది. పెన్షన్ సొమ్ము మీదే ఆధారపడే చాలా మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు గురువారం ఉదయం నుంచే ఎండను లెక్కచేయక సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగారు. బ్యాంకులన్నీ గురువారం పెన్షన్ దారులతో కిటకిటలాడాయి. చాలామంది బ్యాంకు ఖాతాలు అనేక కారణాలతో యాక్టివ్‌గా లేకపోవడం, మైనస్‌లో ఉండడంతో పెన్షన్ సొమ్ము ఖాతాలో పడతానే కట్ అయిపోయింది. దీంతో లబ్ధిదారులకు పూర్తిగా రూ.3 వేల సొమ్ము చేతికి అందలేదు. గురువారం చాలామంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ సొమ్ము పడకపోవడంతో వెనుతిరిగారు.

పెన్షన్ కోసమెళ్లి పరలోకానికి..



కార్వేటినగరం, మే 2: మండుటెండలో పెన్షన్ కోసం కాలినడకన పద్మసరస్సు గిరిజన కాలనీ నుంచి కార్వేటినగరం వెళుతూ వడదెబ్బ తగిలి గోపాలయ్య(70) మృతిచెందాడు. కార్వేటినగరం గ్రామ పంచాయతీ పద్మ సరస్సు గిరిజన కాలనీకి చెందిన గోపాలయ్య మామిడి తోటలలో కాపలాదారుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం పించన్ తీసుకోవడానికి కాలినడకన కార్వేటినగరానికి బయలుదేరాడు. ఎండ ఎక్కువగా ఉండడంతో మార్గంమధ్యలో వడదెబ్బ తగిలి సొమ్మసిల్లి పడిపోయాడు. పెన్షన్ కోసం కార్వేటినగరం వెళ్లాడని భావించిన కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు పట్టించుకోలేదు. పొద్దుపోయినా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి వెతకడం ప్రారంభించారు. గుర్తించే సమయానికి ఆయన మృతిచెంది ఉన్నాడు. ఆయన భార్య ఇప్పటికే మృతిచెంది ఉండడం, పెద్ద దిక్కు చనిపోవడంతో కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. పెన్షన్ ఇంటి వద్దనే అందించి ఉంటే నాన్న బతికి ఉండేవారని, ఈ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన పిల్లలు మండిపడ్డారు. పించన్లు ఇంటి వద్దే అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే గోపాలయ్య మృతి చెందాడని గ్రామస్తులు అన్నారు.

95 శాతం పింఛను బ్యాంకుల్లో జమ

చిత్తూరు (సెంట్రల్), మే 2: జిల్లాలో 95శాతం పింఛను మొత్తాలను బ్యాంకుల్లో జమ చేశారు. తొలిరోజు 28 శాతం జమకాగా, రెండో రోజుకు 95 శాతం పూర్తయింది. 2,72,867 మంది లబ్ధిదారులు ఉండగా, 2,59,039 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.79.87 కోట్ల నగదును అధికారులు జమ చేశారు. లబ్ధిదారుల వద్ద ఏటీఎం కార్డులు లేకపోవడంతో నగదు తీసుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు.

బోరున ఏడ్చిన మునెమ్మ..



బంగారుపాళ్యం దళితవాడకు చెందిన 80 ఏళ్ల మునెమ్మ గురువారం పెన్షన్ తీసుకునేందుకు సచివాలయం వద్దకు వెళ్లింది. పెన్షన్ సొమ్ము బ్యాంకులో పడిందని సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఊత కర్ర సాయంతో బంగారుపాళ్యంలోని ఎస్‌బీఐ వద్దకు చేరుకుంది. ఆ పెద్దామె అకౌంట్ చెక్ చేసి పెన్షన్ సొమ్ము ఇంకా పడలేదని బ్యాంకర్లు చెప్పారు. దీంతో ఆమె బ్యాంకు ఎదుట కూర్చొని బోరున ఏడ్చేసింది. మునెమ్మకు మరో ఆధారం లేదు. ఎండను తట్టుకుని ఎలాగోలా గురువారం తిరిగింది. ఈ ఎండలకు మరోసారి తిరగలేనంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

ఉద్యాన పంటల నేలమట్టం



రామకుప్పం మండలం బగళనత్తంలో నేలమట్టమైన బీన్స్ తోట

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగండ్ల వాన పడింది. దీంతో పంటలకు నష్టం వాటిల్లింది. అరటి, కూరగాయ తోటలు నేలమట్టమయ్యాయి.

గొరివిమాకులపల్లెలో విరిగిపోయిన అరటిచెట్లు



హలో లోకేశ్ సక్సెస్

సీసీసీ అంటే ఏంటో తెలుసా? చంద్రగిరి, చెవిరెడ్డి, చెవిలో పువ్వు. ఐదేళ్లలో 2 వేల కోట్లు సంపాదించాడు చెవిరెడ్డి.ఆయన పనైపోయింది కాబట్టే పక్క జిల్లాకు వెళ్లిపోయాడు. ఇప్పుడు జూనియర్ వచ్చి చెవిలోపువ్వు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. రెండుసార్లు ఈ కుటుంబానికి అవకాశమిచ్చారు. మీ జీవితాలు మారాయా? ఒక్క పరిశ్రమైనా, ఉద్యోగమైనా వచ్చిందా?





హలో లోకేశ్ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును, ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించమని అభ్యర్థిస్తున్న లోకేశ్

'ల్యాండ్, శాండ్, మైన్స్... ఏదీ వదిలిపెట్టడు ఈ పాపాల పెద్దిరెడ్డి.నేను జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు ఎక్కడికి వెళ్లినా ఒకే రకమైన టిప్పర్, ఒకే రకమైన జేసీబీ. దానిపై పీఎల్ఆర్. పాపాల పెద్దిరెడ్డి సామ్రాజ్యం ఏస్థాయికి వెళ్లిందో చూడండి.చిత్తూరు జిల్లాను క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్న ఈ కుటుంబానికి ఓటు ద్వారా రేడియేషన్ ఇవ్వండి.'

'మై డియర్ జగన్ టైం, డేట్ నువ్వు ఫిక్స్ చేయ్. నేను చంద్రబాబును తీసుకొస్తా. ఇక్కడే తిరుమల ఉంది. నువ్వు ముందు మెట్లు ఎక్కుతావా, లేదా చంద్రబాబు ముందు ఎక్కుతారో చూద్దాం. అప్పుడు ముసిలోడు ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు'

హలో లోకేశ్ కార్యక్రమం యువతలో ఉత్సాహాన్ని నింపింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చంద్రగిరి సమీపంలోని ఐతేపల్లి వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాలనుంచీ వేలాదిమంది యువతీ యువకులు తరలిరావడంతో సభా ప్రాంగణం కళకళలాడింది. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పార్టీ పతాకాలతో తొండవాడనుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.ప్రపంచానికే ఒక విజనరీ నాయకుడైన చంద్రబాబు నాయుడు జన్మించిన నేల ఈ చంద్రగిరి అంటూ ప్రసంగాన్ని మొదలుపెట్టిన లోకేశ్ ప్రసంగంలో రాజకీయ చెణకులు యువతచేత చప్పట్లు కొట్టించాయి.తరువాత పలువురు యువతీయువకులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానాలిచ్చి ఆకట్టుకున్నారు. అంతకుముందు బీజేఎస్ కల్యాణమండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అభ్యర్థులతో లోకేశ్ సమీక్షించారు. తాజా రాజకీయ పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఎన్ఆర్ఐలతో సమావేశమై ఫొటోలు దిగారు.అనంతరం పలువురు వైసీపీ నాయకులు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు.

- చంద్రగిరి



పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటి ముందున్న పోలీసులు

హైకోర్టు బెయిల్ ఇచ్చినా మళ్లీ అరెస్టుకు యత్నం

పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటి ముందు కాపుకాసిన పోలీసులు

పుంగనూరు, మే 2: బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్‌పై సదుం పోలీసులు నమోదు చేసిన రెండు కేసుల్లో హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. పోలీసులు పెట్టిన కేసుల్లో ఆయనపై ఎలాంటి చర్యలూ తీసుకోరాదని అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.హెచ్.నాయుడు ఉత్తర్వులిచ్చారు. గతనెల 29వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగ్రామం సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు వెళ్లడంతో వైసీపీ అల్లరి మూకలు వాహనాలు ధ్వంసం చేసి, పలువురిని గాయపరిచిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనలో సదుం పోలీసులు రామచంద్ర యాదవ్‌తోపాటు మరికొందరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీనిపై రామచంద్రయాదవ్ హైకోర్టుకు వెళ్లగా బెయిల్ మంజూరు చేయడంతో ఆయన పుంగనూరులో ఇంటికి చేరుకున్నారు.

మళ్లీ అరెస్టు చేయాలని వచ్చిన పోలీసులు

ఎర్రాతివారిపల్లెలో జరిగిన గొడవలకు సంబంధించిన కేసుల్లో రామచంద్రయాదవ్‌ను అరెస్టు చేయాలని పుంగనూరులోని ఆయన ఇంటి వద్దకు సీఐ రాఘవరెడ్డి పోలీసులతో వెళ్లారు. ఇంట్లో ఉన్న ఆయన తనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని రెండు ఆర్డర్ కాపీలను సీఐకి పంపారు. అనుమతి లేకుండా ఎర్రాతివారిపల్లెకు వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎంపీడీవో జి.రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సదుం పోలీసుస్టేషన్‌లో రామచంద్రయాదవ్‌పై సెక్షన్ 341, 188 ఐసీపీ ప్రకారం మరో కేసు ఉందని సీఐ చెప్పారు. ఈ క్రమంలో రామచంద్రయాదవ్ హైకోర్టు అడ్వకేట్‌ను సంప్రదించగా అది బెయిలబుల్ కేసని, 41ఏ నోటీసులు ఇవ్వాల్సిన కేసని, అరెస్టుకు అవకాశం లేదని సూచించడంతో ఈ విషయాన్ని యాదవ్ మనుషులు పోలీసులకు తెలిపారు. అయినా చాలాసేపు రామచంద్రయాదవ్‌ను అరెస్టు చేయాలని పుంగనూరు సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రయత్నించారు. పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకోవడం, ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు వెనుదిరిగారు.

పెద్దిరెడ్డి నుంచి నాకు ప్రాణహాని ఉంది

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడుతున్న నాకు ఆయన నుంచి ప్రాణహాని ఉంది. సదుంలో వైసీపీ మూకలు నన్ను హతమార్చాలని చూశాయి. ప్రచార రథంపై రాళ్లు, కర్రలు విసిరారు. పోలీస్‌స్టేషన్‌లోనే నాపై దాడికి ప్రయత్నించారు. విధ్వంసం చేసిన వైసీపీ వారిని విడిచి సదుం ఎస్ఐ మారుతి సామాన్యులపై కేసులు పెట్టారు. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి సదుంలో గాయపడిన బీసీవైపీ కార్యకర్తలను వైద్యం పేరుతో జీపులో తీసుకెళుతూ మంత్రి పెద్దిరెడ్డి మిమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయమన్నారు. ఇప్పుడు కాకపోయినా తర్వాత కచ్చితంగా చేస్తామని బెదిరించారు. వారిని చిత్రహింసలు పెట్టారు. హైకోర్టు ఆదేశాలను కూడా పోలీసులు అమలు చేయడం లేదు.

- రామచంద్రయాదవ్, బీసీవైపీ అధ్యక్షుడు

అభ్యర్థులు వ్యయ వివరాలను ఆడిట్ చేసుకోవాలి



మాట్లాడుతున్న శంకర్ ప్రసాద్ శర్మ

చిత్తూరు కలెక్టరేట్, మే 2: అభ్యర్థులు ఎప్పటికప్పుడు వ్యయ వివరాలను ఆడిట్ చేసుకోవాలని చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శంకర్ ప్రసాద్ శర్మ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి అభ్యర్థీ రూ.95లక్షలకు మించి ఖర్చు చేయడానికి వీలులేదని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదించిన ధరల ప్రకారమే ఖర్చులు చూపాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు



మురళీధర్‌రెడ్డి

పుత్తూరు అర్బన్, మే 2: వడమాలపేట మండల జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డిపై వైసీపీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసింది. బుధవారం అర్ధరాత్రి ఈ మేరకు పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కేఆర్‌జే భరత్ ప్రకటన విడుదల చేశారు. మురళీధర్‌రెడ్డి పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆర్కే రోజా ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. 2019 ఎన్నికల తర్వాత మురళీధర్‌రెడ్డికి, మంత్రి రోజాకు మధ్య విభేదాలు వచ్చాయి. రోజా కుటుంబ సభ్యులు మండలంపై ఆధిపత్యం ప్రదర్శిస్తుండడం, తన వర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోయారు. జెడ్పీటీసీ సభ్యుడిగా మండల అభివృద్ధికి నిధులు కేటాయించుకునే క్రమంలోనూ మంత్రి అడ్డుతగులుతున్నారని మూడు మాసాల క్రితం చిత్తూరు జెడ్పీ సమావేశంతోపాటు మీడియా సమావేశంలో ఆయన ధ్వజమెత్తారు. నామినేషన్ల ముందు వరకు మంత్రి రోజాకు నగరి సీటు ఇవ్వవద్దని వైసీపీ అధిష్ఠానం వద్ద మొరపెట్టుకున్నారు. అది ఫలించలేదు. మురళీధర్ రెడ్డి సస్పెన్షన్‌తో వడమాలపేట వైసీపీలో అలజడి రేగింది. ఆయన అనుచరులు దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. మండలంలో వైసీపీ ఓటుబ్యాంక్‌పై తీవ్ర ప్రభావం చూపనుందనే మాటలు వినబడుతున్నాయి.

రూ.6.33లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

వైసీపీ నేత సహా ఆరుగురిపై కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం కేసులు

తవణంపల్లె, మే 2: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తవణంపల్లె పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మండలంలోని ఉప్పరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గాజులపల్లె నుంచి సరకల్లు వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా రూ.6.33 లక్షల విలువ గల 165 మద్యం కేసులు బయటపడ్డాయి. ట్రాక్టర్ సహా స్వాధీనం చేసుకుని తరలిస్తున్న మణి, మధు, అదే గ్రామానికి చెందిన మైనరు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు హరికృష్ణారెడ్డి, మరో ఇద్దరు పరారీలో ఉండగా ఆరుగురిపై కేసు నమోదు చేశారు. మధు, మణిలను రిమాండుకు, బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.73 వేల నగదు పట్టివేత

పాలసముద్రం, మే2: మండలంలోని బలిజకండిగ వద్ద పళ్లిపట్టు - షోలింగర్ రోడ్డుపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.73,880 నగదును పాలసముద్రం ఎస్‌ఐ భారతి స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు ఆర్కేపేట నుంచి బలరాం పళ్లిపట్టుకు తీసుకెళుతుండగా సీజ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

హెలిప్యాడ్, సభా ప్రాంతాల పరిశీలన

రేపు సీఎం జగన్ పలమనేరు పర్యటన

పలమనేరు, మే2 : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ శనివారం పలమనేరుకు రానున్న నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ అరీఫుల్లా గురువారం హెలిప్యాడ్, సభా ప్రాంతాలను పరిశీలించారు. పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయం పక్కనే ఉన్న ఖాళీ ప్రాంతంలో హెలిప్యాడ్, సభ కోసం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎంబీటీ రోడ్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆయన వెంట ఉన్నారు.



పూతలపట్టు మండలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం







చిత్తూరు వర్షం - ఇంటి స్లాబు కూలి పగిలిపోయిన మట్టి కుండలు

గాలివాన బీభత్సం

పలుచోట్ల జోరుగా వడగండ్లు

నేలమట్టమైన ఉద్యాన తోటలు

రాలిపోయిన మామిడికాయలు

విరిగిన విద్యుత్ స్తంభాలు..సరఫరాకు అంతరాయం



రామకుప్పం-వి.కోట రహదారిలో రోడ్డుకడ్డంగా కూలిన వృక్షం

చిత్తూరు కలెక్టరేట్/రామకుప్పం/ఐరాల/పూతలపట్టు/ ఏప్రిల్ 2: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. పంటలకు నష్టం వాటిల్లింది. పొలం పనులకు ఆటంకం కలిగింది. బంగారుపాళ్యం మండలంలో గాలీవానకు మామిడి నేలరాలింది. నలగాంపల్లిలో వడగండ్లవాన కురిసింది. రామకుప్పం, తవణంపల్లె, ఐరాల, పలమనేరు, సోమల, పూతలపట్టు తదితర మండలాల్లో వర్షం ప్రభావం కనిపించింది. తవణంపల్లెలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి జేసీబీల ద్వారా తొలగించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. రామకుప్పం మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. రెండు విడతలుగా కురవడంతో తోటలు, వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. వడగండ్లకు మామిడి కాయలు దెబ్బతిన్నాయి. పెనుగాలులకు నేలరాలాయి. కెంపసముద్రం సమీప పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో రామకుప్పం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా ఆగిపోయింది. బీన్స్, టమోటా తోటలు నేలమట్టమయ్యాయి. లింగాపురంలో అరటి చెట్లు విరిగిపోయాయి. రామకుప్పం-వి.కోట రహదారికి అడ్డంగా భారీ వృక్షాలు కూలడంతో రాకపోకలు స్తంభించాయి. ఇళ్ల పైకప్పులకు వేసిన జింక్‌షెడ్, ఇనుపరేకులు ఎగిరిపోయాయి. స్పందించిన అధికారులు వృక్షాలు తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. కాగా, మధ్యాహ్నం వరకు ఎండ మండిపోయింది. రికార్డు స్థాయిలో 44డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేడిమికి అల్లాడిపోయిన జనం సాయంత్రం రెండు విడతలుగా కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. ఐరాలలో మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ కాసి తర్వాత వర్షం కురిసింది. అరకొరగా ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. మండలంలోని కుమ్మరపల్లెలో ఓ ఇంటి స్లాబు పడిపోయింది. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ నాగరత్నమ్మ కుండలు తయారు చేసి జీవనం సాగించేది. స్లాబు కూలిపోవడంతో కుండలు 90 శాతం పగిలిపోయాయి. ఆ సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడింది. పూతలపట్టుతోపాటు పలు గ్రామాల్లో గంటపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పోలవరం, చింతమాకులపల్లి, పూతలపట్టులలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మధ్యాహ్నం వరకు ఎండ..ఉక్కపోత



నలగాంపల్లిలో వడగండ్ల వాన

జిల్లాలో గురువారం మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ..ఉక్కపోత ఉన్నాయి. గంగవరం, తవణంపల్లి మండలాలు రెడ్ జోన్‌లోకి వెళ్లగా, నింద్ర, శ్రీరంగరాజపురం, వి.కోట మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. ఉదయం నుంచి వడగాడ్పుల ప్రభావం కనిపించింది. ఉక్కపోత విపరీతంగా ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం 3 గంటల నుంచి వాతావరణం చల్లబడింది. బైరెడ్డిపల్లిలో 41.1, బంగారుపాళ్యం 43.9, చిత్తూరు 42.5, చౌడేపల్లి 42.3, గంగాధరనెల్లూరు 42.9, గంగవరం 45.9, గుడిపాల 43.3, ఐరాల 40.6, కార్వేటినగరం 42.1, కుప్పం 41.4, నగరి 42.3, నింద్ర 45.6, పలమనేరు 41.3, పాలసముద్రం 41.8, పెద్దపంజాణి 42.6, పెనుమూరు 41.3, పులిచెర్ల 42.2, పుంగనూరు 42.2, పూతలపట్టు 42.7, రొంపిచెర్ల 42.3, శాంతిపురం 40.7, సదుం 41.6, సోమల 42.2, శ్రీరంగరాజపురం 44.6, తవణంపల్లె 46.4, వెదురుకుప్పం 43.1, వి.కోట 42.1, విజయపురం 41.6, యాదమరిలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.





బ్రాహ్మణవీధిలో వలంటీర్‌ను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు - ఇరువర్గాలను పక్కకు పంపుతున్న పోలీసులు

టీడీపీ నేతలపై వైసీపీ దాష్టీకం

వలంటీర్ ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ శ్రేణులపై దాడి

వి.కోట, మే 2: వి.కోటలో వలంటీర్ ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతలు దాడికి తెగబడ్డారు. గురువారం ఉదయం పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వలంటీర్ లలిత ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తుండగా టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వలంటీర్లు ప్రచారంలో పాల్గొనకూడదని చెప్పినా ఎందుకిలా చేస్తున్నారని నిలదీశారు. ఇంతలో అక్కడున్న వైసీపీ నేతలు తమ ప్రచారాన్నే అడ్డుకుంటారా అంటూ టీడీపీ వర్గీయులను దుర్భాషలాడారు. అదే సమయంలో పక్కవీధిలో ప్రచారంలో ఉన్న టీడీపీ నేతలు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయినా పట్టించుకోకుండా వైసీపీ నేతలు మాటల యుద్ధానికి దిగారు. మాటామాటా పెరిగి వైసీపీ నేతలు టీడీపీ వారిపై భౌతిక దాడికి దిగారు. కార్యకర్తలను చితకబాదడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బాధితుల కుటుంబ సభ్యులు అడ్డు వెళ్లడంతో మహిళలని చూడకుండా దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పక్కకు తోశారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో సీఐ లింగప్ప ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. కాగా ఈ ఘటనపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని టీడీపీ నేతలు తెలిపారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎన్నికల పరిశీలకులు కైలాస్ వాంఖడే, సాధిక్ ఆలం గురువారం పరిశీలించి, పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.
- చిత్తూరు కలెక్టరేట్

ప్రచారంలో దూసుకుపోతున్న దగ్గుమళ్ల



సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

పూతలపట్టు, మే 2: చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎక్కడికి వెళ్లినా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజాభిమానం వెల్లువెత్తుతోంది. గురువారం పూతలపట్టు నియోజకవర్గంలోని పేటమిట్టలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో దగ్గుమళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్‌కు సంబంధించిన కరప్రతాలను అందజేసి, వాటి గురించి వివరించారు. వైసీపీ విధానాలతో రాష్ట్ర ప్రజలు అన్ని విధాలా నష్టపోయారని, ఈ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ నాయకులు కూడా కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వారు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, ఆమె భర్త పారిశ్రామికవేత్త గల్లా రామచంద్ర నాయుడు నివాసానికి వెళ్లి తమ గెలుపునకు సహకరించాలని కోరారు. కరపత్రాలను అందజేశారు. వారికి సాదరస్వాగతం పలికిన గల్లా దంపతులు కాసేపు రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ప్రసాదరావు, మురళీమోహన్ గెలుపునకు ఎలాంటి ఢోకా లేదని, తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడే ఉన్న కోదండరామాలయాన్ని రామచంద్ర నాయుడుతో కలిసి దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు వారికి స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలని అక్కడి అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు.



కోదండరామాలయంలో ఆశీర్వాదం

తెలుగుదేశం పార్టీలోకి మున్సిపల్ వైస్ చైర్మన్ సోదరుడు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఫైరోజ్

కుప్పం, మే 2: కుప్పం మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ సోదరుడు, వైసీపీ మైనారిటీ నాయకుడు ఫైరోజ్ గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో రాయచోటికి వెళ్లిన ఫైరోజ్ అక్కడ చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. స్వయంగా చంద్రబాబు ఆయనకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సురేశ్ బాబు, కుప్పం నియోజకవర్గ టీడీపీ మైనారిటీ నాయకులు జాకీర్, అన్సర్‌బాషా, సర్దార్‌బాషా పాల్గొన్నారు.

చిత్తూరు నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్

- నారా లోకేష్ సమక్షంలో చేరిన వైసీపీ కీలక నేతలు



నారా లోకేష్ సమక్షంలో చేరిన వైసీపీ నేతలు ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి

చిత్తూరు సిటీ, మే 2: చిత్తూరు వైసీపీలో క్రియాశీలకంగా ఉన్న నేతలు గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు నగరానికి చెందిన వైసీపీ నేతలు ఎల్‌బీఐ బిల్డర్స్ అధినేత లోకేష్ రెడ్డి, 1వ డివిజన్ ప్రధాన కార్యదర్శి కిషోర్, ప్రవీణ్ రెడ్డి, నగర కమిటీ సభ్యులు సవన్, హరీష్, 2 వ డివిజన్ ఇన్చార్జ్ శ్రీనివాసన్, 3వ డివిజన్‌కు చెందిన తిరుకుమరన్, ముత్తిరేవుల మాజీ సర్పంచ్ మురళి, వైసీపీ మాజీ జిల్లా యువత సభ్యులు వినోద్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప రెడ్డి, 5వ డివిజన్ నేతలు సురేంద్ర రెడ్డి, రంజిత్ రెడ్డి, శ్యామ్, నగర యువత సభ్యుడు పవన్, 23వ డివిజన్‌కు చెందినన వైసీపీ ప్రచార కార్యదర్శి అరుణ్, వెంకటేష్, కార్తిక్, 47వ డివిజన్ నేతలు శివకుమార్, 48వ డివిజన్ ప్రచార కార్యదర్శి వినాయకం, 49వ డివిజన్ ఇన్చార్జ్ పురుషోత్తం 50వ డివిజన్ ఇన్చార్జ్ మణి, భాస్కర్, దీనాతోపాటు గుడిపాల మండల ఎంపీటీసీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, జిల్లా మహిళా కార్యదర్శి వాణి తదితరులు టీడీపీలో చేరారు. వీరికి నారా లోకేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ అధ్యక్షుడు పులివర్తి నాని, పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గురజాల సందీప్ ఆధ్వర్యంలో చంద్రగిరి పర్యటనకు విచ్చేసిన నారా లోకేష్ సమక్షంలో వైసీపీ నేతలు టీడీపీలో చేరారు.

ఊటూరు దేవరెద్దుకు అంత్యక్రియలు




చౌడేపల్లె, మే2: ఊటూరు దేవరెద్దుకు గురువారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ఆలయ దేవరెద్దులలో ఒకటైన ఊటూరు దేవరెద్దు బుధవారం మృతి చెందింది. 2008 ఆగస్టు 15 నుంచి ఇది స్వామివారికి సేవలందించింది. మృతి చెందడంతో రాజనాలబండ ఆలయ నిర్వాహకులు ఊటూరు దేవరెద్దు దానసప్పలైన మల్లికార్జున, భాస్కర్, గాజులవారిపల్లె, కొలింపల్లె దేవరెద్దుల దానప్పలు బుడుగు బాలాజి, గంగిరెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



పలమనేరు, మే2 : చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక దుప్పి మృతిచెందింది. జాతీయరహదారిలో పలమనేరుకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని బూతలబండ సమీపంలో రోడ్డు దాటుతున్న దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దుప్పి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. పలమనేరు రేంజర్ శివన్న, సబ్ డీఎఫ్‌వో సి.వేణుగోపాల్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పంచనామా తర్వాత దుప్పి కలేబరాన్ని కాల్చివేశారు.



టీడీపీ హయాంలో..

- సాధారణ మరణానికి రూ.2 లక్షలు
- ప్రమాదంలో మరణించినా, పూర్తి అంగ వైకల్యం కలిగినా రూ.5 లక్షలు
- పాక్షిక అంగ వైకల్యానికి రూ.3,62,500
- మట్టి ఖర్చులకు: అంత్యక్రియల సమయంలోనే రూ.5 వేలు
- వయసు: అన్నింటికీ 18 నుంచి 70 ఏళ్లు
- అర్హులు: కుటుంబంలోని సభ్యులందరూ
- నెల రోజుల్లో కుటుంబ సభ్యుల ఖాతాల్లో డబ్బులు

ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో..

- సాధారణ మరణానికి రూ.లక్ష
- ప్రమాదంలో మరణించినా, పూర్తి అంగ వైకల్యం కలిగినా రూ.5 లక్షలు
- పాక్షిక అంగ వైకల్యానికి ఏమీ ఇవ్వడం లేదు
- మట్టి ఖర్చులకు: అంత్యక్రియలయ్యాక రెండు వారాలకు రూ.10 వేలు
- వయసు: సాధారణ మరణానికి 50 ఏళ్లు, ప్రమాద మరణానికి 70 ఏళ్లు
- అర్హులు: కుటుంబ పెద్ద మాత్రమే
- మండలాల్లో బీమా మిత్రలను తొలగించింది
- ఏళ్లు గడుస్తున్నా కుటుంబ సభ్యులకు డబ్బు అందడం లేదు

← నాడు.. నేడు బీమా పథకం అమలిలా →

బీమా.. ఏదీ ధీమా?

● వైసీపీ ప్రభుత్వంలో ఏళ్లు గడిచినా బాధితులకు అందని పరిహారం
● టీడీపీ హయాంలో కుటుంబమంతటికీ వర్తింపు ● ఇప్పుడేమో కుటుంబ పెద్దకే

జిల్లాలో 2022-23లో వివిధ ప్రమాదాల్లో 111 మంది, సహజంగా 868 మంది వంతున మొత్తం 979 మంది మరణించారు. వీరిలో 107 మందికే పరిహారం అందింది. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసి ఏడాది దాటినా ఇంకా 872 మందికి వైఎస్ఆర్ బీమా అందలేదు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో 743 మంది మరణిస్తే 88 మందికి పరిహారాన్ని అందించారు. ఇంకా 655 మందికి బీమా రాలేదు.

- కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు కాసింత ఆర్థికదన్నుగా నిలిచే వైఎస్ఆర్ బీమా పథకం విషయంలో జగన్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ గణాంకాలే నిదర్శనం. అయినా.. తాము బీమాతో అండగా నిలుస్తున్నామంటూ కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడం ఈ ప్రభుత్వానికే చెల్లింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

నా పేదలు, నా పేదలు.. అని పదేపదే సభల్లో సీఎం జగన్ చెబుతుంటారు. వాళ్లకు ఏమైనా ప్రయోజనం కలిగి ఉంటే అది తనవల్లేనని గొప్పగా అంటారు. కానీ, అలాంటి పేదలకు అండగా నిలిచే విషయంలో మాత్రం చిత్తశుద్ధి కనిపించదు. అలాంటి వాటిలో వైఎస్ఆర్ బీమా పథకం ఒకటి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబ సభ్యులకు వెంటనే చంద్రన్న బీమా గుర్తుకు వచ్చేది. మండలాల్లోని వెలుగు కార్యాలయాలను ఆశ్రయించేవారు. అంత్యక్రియల కోసం ఆ బాధితులకు రూ.5 వేలు తక్షణ సాయం అందేది. సహజ మరణమైతే రూ.2 లక్షలు, ప్రమాద మరణమైతే రూ.5 లక్షల ఆర్థిక సాయం నెలలోపు ఆ కుటుంబ సభ్యులకు అందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకం పేరును వైఎస్సార్ బీమాగా మార్చారు. అమలు చేయడంలో విఫలమైంది. ఇప్పుడు మట్టి ఖర్చులకు తక్షణ సాయం అందడం లేదు. ఏళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు బీమా పరిహారం దక్కడం లేదు. వైసీపీ ప్రభుత్వం అనేక రకాల నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించింది.

టీడీపీ హయాంలో పకడ్బందీగా...

ఈ పథకం అమలు కోసం టీడీపీ ప్రభుత్వంలో మండలానికో బీమా మిత్ర పనిచేసేవారు. ఎప్పటికప్పుడు బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నెల రోజుల్లో పరిహారం అందేలా కృషి చేసేవారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం ఈ బాధ్యతను వలంటీర్లకు అప్పగించింది. వలంటీర్లు వివరాలు సేకరించి సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రాసెస్ చేస్తున్నారు. చివరిగా జిల్లా కేంద్రంలోని పీడీ కార్యాలయంలో ఫైనల్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఇంత చేసినా పరిహారం సమయానికి అందడం లేదని వాపోతున్నారు. బీమా సొమ్మును అందించే ఇన్సూరెన్సు కంపెనీలకు ప్రభుత్వం సక్రమంగా ప్రీమియం కట్టడం లేదని, అందుకే ఆయా కంపెనీలు బాధిత కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించడం లేదని తెలుస్తోంది.

పాలకులూ.. వీటికేమంటారు?

మూడేళ్లుగా నిరీక్షణే..

గుడిపాలకు చెందిన ఈమె పేరు మమత. భర్త భూపతినాయుడు. ప్రైవేటు బస్సు కండక్టరుగా పనిచేసేవారు. 2021 మార్చి 7న గుడిపాల మండలంలోని వసంతాపురం వద్ద బైకులో ప్రయాణిస్తుండగా కారు ఢీకొంది. 16 రోజులు వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 17వ రోజు మరణించారు. ఆయన మరణించిన 15 రోజుల తర్వాత రూ.10 వేలను అందించారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రమాదవశాత్తు మరణించడంతో రూ.5 లక్షలు పరిహారం రావాలి. మట్టి ఖర్చులకు ఇచ్చిన రూ.10 వేలు పోను మిగిలిన రూ.4.90 లక్షల కోసం బాధితురాలు మూడేళ్లకుపైగా వేచి చూస్తున్నారు. కుటుంబ పోషకుడి మృతితో వీరి కుటుంబం ఆర్థికంగా ఛిన్నాభిన్నమైంది. రోజువారి కూలి పనులకు వెళ్లే ఈమెకు ఆ డబ్బు వస్తే సపోర్టుగా ఉంటుంది.



మృతిచెంది మూడేళ్లయినా..



శాంతిపురం మండలం పొన్నేపల్లె గ్రామానికి చెందిన ఈయన పేరు చెంగ్రాయప్ప. 2021 జనవరి 21న శాంతిపురం సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. పీఈఎస్ ఆస్పత్రిలో వారం రోజులు చికిత్స పొంది జనవరి 28న మృతిచెందారు. మట్టి ఖర్చులకు అధికారులు రూ.10 వేలు అందించారు. మూడేళ్లు పూర్తయినా కుటుంబ సభ్యులకు మిగిలిన రూ.4.90 లక్షల బీమా సొమ్ము రాలేదు.

నాలుగేళ్లయినా అందని బీమా



శాంతిపురం మండలం పొన్నేపల్లె గ్రామానికి చెందిన ఈమె పేరు శాంతకుమారి. కుమారుడు కార్తీక్ బీటెక్ చదివి బెంగళూరులో ఉద్యోగం చేసేవారు. కిడ్నీలో రాళ్లున్నాయంటే కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రెండు రోజులకు పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ 2020 మార్చి ఒకటో తేదీన మృతి చెందారు. చేతికొచ్చిన కుమారుడు మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. అప్పట్లో రూ.5 వేలను అధికారులు అందించారు. మిగిలిన రూ.95 వేలను వెంటనే ఇస్తామని చెప్పారు. నాలుగేళ్లయినా ఇంకా రాలేదు.

గెలుపే లక్ష్యంగా..!

జీడీ నెల్లూరు వర్తమానం

జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఈసారి గెలుపే లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతోంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో వేపంజేరి కనుమరుగై.. జీడీనెల్లూరు, పూతలపట్టు ఏర్పాటయ్యాయి. జీడీనెల్లూరుకు మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో 2009లో కాంగ్రెస్, 2014, 2019లో వైసీపీ గెలిచింది. తొలిసారిగా జయకేతనం ఎగురవేయాలన్న కృతనిశ్చయంతో టీడీపీ అభ్యర్థి థామస్, నేతలు, శ్రేణులు గట్టిగా పనిచేస్తున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుటుంబం మీద ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ నుంచి ఆయన మేనల్లుడు రమేష్ బాబు పోటీ చేస్తుండడం వంటి కారణాలతో వైసీపీ క్యాంపు డీలా పడింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/వెదురుకుప్పం

● పనిచేసుకుపోతున్న టీడీపీ శ్రేణులు

తీవ్రస్థాయిలో వ్యతిరేకత కూడగట్టుకున్న నారాయణస్వామి

వైసీపీపై కాంగ్రెస్ అభ్యర్థి ప్రభావం

థామస్‌కు అనేక అనుకూలతలు..



ఈసారి జీడీనెల్లూరులో జెండా ఎగురవేయాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ అధినేత డాక్టర్ థామస్‌ను రంగంలోకి దింపింది. జూన్ 1న ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినప్పటి నుంచీ ఆయన అందర్నీ కలుపుకొని ముందుకు వెళుతున్నారు. ఎన్నికలు దగ్గరపడిన తర్వాత పూర్తి సమయాన్ని ఆయన నియోజకవర్గానికే కేటాయించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి, కుమారుడు, తమ్ముడు.. ఇలా కుటుంబ సభ్యులంతా నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. ఆ మధ్య నియోజకవర్గంలో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు థామస్ గొప్పతనం గురించి వివరించారు. దాంతో ప్రజలందరికీ థామస్ గురించి మరింత తెలిసింది. ఇన్‌ఛార్జిగా నియమించిన కొత్తలో కొంతకాలం తడబాటుకు గురైనా ఆ తర్వాత నియోజకవర్గంలోని సీనియర్ల సహకారంతో పుంజుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు పండుగలకు బహుమతులు పంపిణీ చేయడం, కార్యకర్తల ఇళ్లల్లో జరిగే ప్రతి కార్యక్రమాలకు హాజరవ్వడం, గ్రామాల్లో తాగునీటి ప్లాంట్లు వంటి అవసరాలను తీర్చడంతో ప్రజలకు దగ్గరయ్యారు.

నారాయణస్వామిపై వ్యతిరేకత



తన వయసునూ పక్కనపెట్టి డిప్యూటీ సీఎం నారాయణస్వామి అవకాశమున్నప్పుడల్లా సీఎం జగన్ కాళ్ల మీద పడడం.. జగన్ కోసం తన చర్మం వలిచి చెప్పులు కుట్టించుకుంటాననడం.. వంటి చర్యలతో తమ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టారనే ఆగ్రహం దళితుల్లో ఉంది. అలాగే, మాటిమాటికీ నియోజకవర్గంలోని రెడ్ల మీద విమర్శలు చేయడంతో.. ఆయనపై వీరూ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఉంది. ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్నా, సతీమణిని కార్వేటినగరం జడ్పీటీసీగా అక్రమ ఏకగ్రీవం చేసుకోవడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ప్రతి మండలంలోనూ కొండల్ని, గుట్టల్ని ఆయన ఆయన అనుచరులు చదును చేసుకుని ఆక్రమించుకున్నారు. మామిడి మొక్కలు నాటి సాగు చేపట్టారు. నియోజకవర్గంలో ఏ కొండ చూసినా గుండు కొట్టేశారు. నారాయణస్వామికి టికెట్ రాకుండా స్థానిక రెడ్డి సామాజికవర్గ నాయకులు బలంగా ప్రయత్నించి తొలుత విజయం సాధించారు. ఆ తర్వాత నారాయణస్వామి సీఎం జగన్ వద్దకెళ్లి బతిమలాడుకుని టికెట్ తెచ్చుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. చివరగా తన కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ తెచ్చుకున్నారు. ఈ వ్యతిరేకత ఆయన కుమార్తెకు ఇబ్బందికరంగా మారనుంది.

కాంగ్రెస్ అభ్యర్థితోనూ తీవ్ర నష్టం



నారాయణస్వామి గెలుపు కోసం దశాబ్దాలుగా కృషి చేసిన ఇద్దరు మేనల్లుళ్లలో ఒకరైన రమేష్‌బాబు ఆయనతో విబేధించి కాంగ్రెస్‌లో చేరారు. కృపాలక్ష్మిని ఓడిస్తానంటూ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇటీవల కార్వేటినగరంలో ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన ప్రచారానికి ఆదరణ లభించింది. దీంతో వైసీపీ ఓట్లను ఆయన పెద్దఎత్తున చీల్చగలరని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నరసింహులుకు 1967, 2279 ఓట్లు పోలయ్యాయి. ఈసారి రమేష్ బాబు అభ్యర్థి కావడంతో ఆ ఓట్లు బాగా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఇదీ మందు

కూలి పెంచాల్సిందేనప్పా!



'మరీ ఇంత తక్కువయితే లాబంలేదు సామీ. కూలీ పెంచకపోతే మేం వచ్చేది లేదు' అని తెగేసి చెప్తావుండారంట జనం. ఒగపక్క ముమ్మరంగా నామినేసన్లు ఏసేసినారు అబ్యర్తులు. మరోపక్క ప్రెచారాలకూ మల్లుకుని చానాకాలమే అయింది. నామినేసన్లప్పుడు ర్యాలీలు తీస్తే సరిపోతందా.. పోదుగదా. ఇప్పుడు ప్రెచారాలు గెట్టిగా చెయ్యాల. ఆమాదిరిగా చెయ్యాలంటే కనాకస్టం యాభై మంది జనం గావాల. వోల్లతోపాటు ఈదిలో జనమంతా మనపక్కే ఉండారని ఊదరగొట్టాల. అధికార పార్టీ ఈ ఐదేల్లు చేసిన దాడులు, దౌర్జన్యాలకు కడుపు మండిన జనం, ఎవురు పిల్సినా పిలవకపొయ్యినా ప్రతిపక్ష పార్టీ ప్రెచరాల్లో, ర్యాలీల్లో వొచ్చి కలిసిపోతావుండారు. కానీ ఇప్పుడొచ్చిండే చిక్కంతా అధికార పార్టీకే. 'పథకాలిచ్చినాము గదా, ప్రెచారానికి వొచ్చెయ్యండంటే, జనం ఒగ పట్టాన కదలడంల్యా. రాకపోతే ఆ పథకాలు క్యాన్సిలు జేసేస్తామని బెదిరించడానికి ఇపుడు వాల్ల ప్రెబుత్వమూ అధికారంలో ల్యాకుండా పాయె. బలవంతంగా రాజీనామాలు చెయ్యించిన వాలంటీర్లు గూడా మనకెందుకొచ్చిన గొడవని గమ్మునుండి పొయిరి. జనంజూస్తే కొండెక్కి కూకోనుండారు. వాల్లకు నిన్నమొన్నటిదాకా ర్యాలీలకు, ప్రెచారాలకు ఎల్లొస్తే రొండొందలనింకా నాలుగొందలదాకా మాత్రమే కూలీ దక్కతా వుండాది. వాటర్ బాటిలు, బిర్యానీ ప్యాకెట్లు గూడా ఇస్తావుండారు. మొగోల్లకయితే క్వార్టరు చీపు లిక్కరు అదనం. కానీ అధికార పార్టీ ప్రెచారానికి జనం పెద్దగా మొగ్గు చూపడంలేదంట. మొన్నీమజ్జ ఆ పార్టీ ర్యాలీకని తీసుకోనెల్లిన నాయకులు కక్కుర్తిపడి.. ఎదురుగుండా లేరనిజెప్పి, కొంతమంది ఆడోల్లకి కాసులు ఎగ్గొట్టడానికి జూసిన పాపం ఇప్పుడు కొడతా వుండాదంట. 'ప్రెచారాలకు ఎల్లొచ్చినాక మీరు కాసులు దర్మంగా ఇస్తారని గ్యారంటీ ఏంది?' అని ఆడోళ్లు ఎదురు తిరగతా ఉండారంట. అంతేకాదు.. 'ఎండలు మండిపోతావుండాయి. ఈ ఎర్రటి ఎండల్లో ర్యాలీలకు, ప్రెచారాలకు వొచ్చి వడదెబ్బ తగిలి మేం ఆస్పత్రిపాలైతే మీరు జూస్తారా?' అని గూడా కొసిన్లు ఏస్తావుండారంట. కూలీ డబ్బులు ఆరేడువొందలు జేస్తేనే, అదిగూడా ముందుగా మా చేతుల్లో పెడితేనే ప్రెచారాలకు కదిలొస్తామని తెగేసి జెప్తావుండారంట జనం. డబ్బులు పంచే చోటా నాయకులమీద అస్సలు నమ్మకంలేని జనంలో కొంతమందైతే.. ముందుగా నూరో, ఇన్నూరో అడ్వాన్సు కొట్టి మల్ల మాట్లాడు' అనేస్తావుండారంట. వాల్ల డిమాండ్లను తీర్చడంతప్ప, అధికార పార్టీకి ఏరే మార్గం కనిపించడంలేదు. ప్రెతిపచ్చ పార్టీకి గూడా జనం తీరుజూసి 'ఈ పద్దినాలు ఈ ఎట్టరా ఈల్లతో ఏగాల బగమంతుడా' అనేసి గుబులు పుడతా వుండాదంటే నమ్మండి.

- కుప్పం

● గుర్తుంచుకోండి

రాజకీయ అల్లరీ నేరమే

ఏదైనా రాజకీయ పార్టీ ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు, అక్కడ నిర్వహించే సమావేశాలను ఆ పార్టీకి సంబంధం లేని వ్యక్తి అడ్డుకోవడం, భంగపరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. ప్రచార సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తి గురించి వివరాలు రాబట్టుకోవచ్చు. ఇక, పోలీసులకు కూడా ఆ వ్యక్తి తన వివరాలను చెప్పకపోతే, వారెంట్ లేకుండా అతడిని నిర్బంధంలోకి తీసుకోవచ్చు.

- చిత్తూరు

● మీకు తెలుసా ?

గోడలపై రాతలు మాయం



గతంలో ఎన్నికలు వచ్చాయంటే చాలు.. గోడలన్నీ ఆయా పార్టీల అధినేతలు, అభ్యర్థుల బొమ్మలు, గుర్తులు, రాతలతో నిండిపోయేవి. ఎటు చూసినా తమ పార్టీకే ఓటు వేయాలనే ప్రచార ప్రకటనలు కనిపించేవి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునే వారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం. వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేసేవారు. అప్పట్లో గోడలపై రాసే, బొమ్మలేసే ఆర్టిస్టులకు డిమాండు ఎక్కువగా ఉండేది. ఎన్నికలు ముగిశాక ఇళ్ల యజమానులు రంగులేసుకునే వారు. క్రమేణా ఎన్నికల నిబంధల కారణంగా గోడమీద రాతలు కనుమరుగయ్యాయి. ఇప్పుడా స్థానంలో ఫ్లెక్సీలు చేరిపోయాయి.

- చిత్తూరు కలెక్టరేట్

● ఇదీ సంగతి

బుజ్జగింపులకే పుణ్యకాలం సరి..



వైసీపీలో విభేదాల పంచాయితీలు కొలిక్కి రావడం లేదు. ఒక పక్క గడువు ముంచుకొస్తున్నా నగరి వైసీపీ అభ్యర్థి రోజా ఎన్నికల ప్రచారం మీద దృష్టిసారించలేక పోతున్నారు. పుణ్యకాలం కాస్తా పార్టీ అంతర్గత విభేదాల పరిష్కారానికే సరిపోతోంది. కుటుంబ సభ్యులకు ప్రచార బాధ్యతలను అప్పగించి ఆమె అసమ్మతి నాయకుల అనుచరులను మచ్చిక చేసుకునే పనిలో బిజీగా గడుపుతున్నారు. ఒక్కొక్కరికి ఒకటి పదిసార్లు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. వీలైనంత వరకు నగరిలోని తన ఇంటికి పిలిపించుకుని బుజ్జగించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. నింద్రకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని తనవైపు తిప్పుకునేందుకు ఏకంగా ఐదుసార్లు ఆమె ఇంటికి వెళ్లాల్సివచ్చింది. దీంతో ఆ మహిళా ప్రజాప్రతినిధి ఎట్టకేలకు మంత్రి రోజాను నగరిలో కలిసి మద్దతు ప్రకటించింది. ఒక్కొక్కరి ఇంటి చుట్టూ ఇన్నిన్ని సార్లు తిరగాల్సి రావడం మంత్రి క్యాంప్‌లోని వైసీపీ నాయకులకు తలనొప్పిగా మారిందనే మాటలు వినబడుతున్నాయి. దీంతో ప్రచార పర్వంలో మంత్రి రోజా వెనుకబడ్డారని నియోజకవర్గ ఓటర్లు గుసగుసలాడుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్

మొక్కలు నాటితేనే మంచి వాతావరణం


మొక్కనాటి రక్షణ కంచె ఏర్పాటు చేసిన దేవేంద్ర

పలమనేరు, మే2 : మొక్కలు నాటి సంరక్షించ గలిగితేనే భావితరాలకు ఆరోగ్య కరమైన వాతావరణం ఉంటుందని పలమనేరు ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పేర్కొన్నారు. గురువారం పలమనేరు ఆర్టీసీ డిపో నుంచి కళాశాలకు వెళ్లే రహదారి పక్కన కానుగ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా పలమనేరులోనూ ఎండలు 40 డిగ్రీలను దాటాయని తెలిపారు. ఇందుకు కారణం చెట్లు రోజురోజుకూ అంతరించిపోవడమే అన్నారు. ఇకనైనా పట్టణ వాసులు మేల్కొని మొక్కలు విస్తారంగా నాటి సంరక్షించాలని కోరారు.

కుటుంబ సాధికార సమితులే కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష మెజార్టీ లక్ష్య సాధనలో కుటుంబ సాధికార సమితులదే కీలకపాత్ర అని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీపీ చిన్నకృష్ణలు తెలిపారు. గురువారం మండల పరిధిలోని పలుగ్రామాల్లో పార్టీ కుటుంబ సాధికార సమితుల సభ్యుల సమావేశాల్లో వారు మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ గురించి వివరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుయువత అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువ నేతలు


ప్రతాప్‌రెడ్డి, సురేష్‌రెడ్డిలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మే 2: రామకుప్పం మండలం మణీంద్రం పంచాయతీ అత్తికుప్పానికి చెందిన వైసీపీ యువనేతలు ప్రతాప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, మాజీ సర్పంచు శ్రీరాములురెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్ది వైసీపీ ఖాళీ కావడం తథ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు రామలింగారెడ్డి, సలాంసాబ్, జ్ఞానశేఖర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, భానుమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లోనూ ఇలాగే రాణించాలి


ఉత్తమ ఫలితాలు సాధించిన మీనాను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

శాంతిపురం, మే 2 : ఉన్నత చదువుల్లోనూ ఇలాగే రాణించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆకాంక్షించారు. పదవ తరగతిలోను, ఇంటర్మీడియట్‌లోను ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఆయన గురువారం తన ఇంట్లో సన్మానించారు. శాంతిపురం మండలం తుమ్మిశి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమార్తె మీనా శాంతిపురం ఆదర్శ పాఠశాలలో పదో తరగతిలో 582 సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదే గ్రామానికి చెందిన టీకే మంజునాథ్ కుమార్తె బీఎం.సురేఖ కుప్పం బీసీఎన్ విద్యా సంస్థల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000కి 971 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తన ఇంట్లో వారిని అభినందించారు. టీడీపీ నాయకులు మంజునాథ్, సింగిరి శ్రీనివాసులు, నాగరాజు, రామచంద్రనాయుడు, రాజప్ప, శేఖర్, లక్ష్మీనారాయణ, జయరాం పాల్గొన్నారు.

బాబుతోనే బిడ్డల భవిష్యత్తుకు గ్యారంటీ


అబకలదొడ్డిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, మే 2 : చంద్రబాబుతోనే బిడ్డల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని మాజీ మండల అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్‌నాయుడు అన్నా రు. గురువారం మండల పరిధిలోని అబకలదొడ్డి, గుంజార్లపల్లె గ్రామ పంచాయతీలో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన అన్యాయం గురించి తెలియజేశారు. ప్రజలు బాగా ఆలోచించి చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి ఆంజనేయరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, భద్రప్ప, క్యాబేజి మురళి, గణపతి, మునిరాజు, బాబు, నారాయణ, మునెప్ప, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేసవి తాపం తీర్చిన వర్షం

పలమనేరు, మే2 : పలమనేరు పట్టణంలో గురువారం సాయంత్రం సుమారు 3గంటల నుంచి 3.30 నిముషాల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. 15రోజులుగా తీవ్రమైన ఎండవేడిమితో అల్లాడుతున్న పట్టణ ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది.

యూటీఎఫ్ వ్యవస్థాపకుడు దాచూరికి ఘన నివాళి



పలమనేరు, మే2: యూటీఎఫ్ వ్యవస్థాపకుడు దాచూరి రామిరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా గురువారం పలమనేరులో యూటీఎఫ్ ఉపాధ్యాయులు దాచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్, జిల్లా నాయకులు క్రిష్ణమూర్తి, బాబు, ప్రసన్నకుమార్, డివిజన్ నాయకులు పాపయ్య, గురుమూర్తి, హరిగోవిందయ్య, వేమచంద్రారెడ్డి, శారద, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, గురునాథం, హరినాథరెడ్డి, కోదండరెడ్డి, మురళీక్రిష్ణ, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

చిరుజల్లులతో కాస్త ఉపశమనం

సోమల, మే 2: ఎండ, వడగాడ్పులతో ఉడుకుతున్న జనం గురువారం మధ్యాహ్నం కురిసిన చిరుజల్లులతో కాస్త ఉపశమనం పొందారు. కొద్దిరోజులుగా సోమలలో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం రోడ్డుపైకి రావడానికే భయపడ్డారు. ముఖ్యంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో వాతావరణం కాస్త చల్లబడింది.

దివ్యాంగులకు రూ.6వేల పింఛను: టీడీపీ


పులిచర్ల మండలం చల్లావారిపల్లి పంచాయతీలో చల్లా పూజారెడ్డి, రొంపిచెర్ల మండలం బోడిపాటివారిపల్లెలో చల్లా సుప్రియారెడ్డి, చౌడేపల్లె మండలం అమినిగుంటలో వీణారెడ్డి ఎన్నికల ప్రచారం

సోమల, మే 2: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పీ.ఎం.మల్లికార్జున ఆధ్వర్యంలో సోమల దళితవాడలో ఇంటింటా కరపత్రాలను అందజేశారు. పార్టీ నాయకులు శివశంకర్, మహేంద్రబాబు, మణి, చాణుక్య, కపిల సుబ్రమణ్యం పాల్గొన్నారు. ● జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో ఇర్లపల్లెలో ప్రచారం చేశారు. ● బీజేపీ నియోజక వర్గం కన్వీనర్ గన్నా మదన్ మోహన్‌బాబు పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లెలో ప్రచారం నిర్వహించారు.

కల్లూరు: పుంగనూరు ఎమ్మెల్యేగా చల్లా రామ చంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె చల్లా పూజారెడ్డి కోరారు. పులిచెర్ల మండలం చల్లావారిపల్లి పంచాయతీలో గురువారం ఆమె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మన బ్రతుకులు మారాలంటే చంద్రబాబు సీఎం కావాలి పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామ చంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి అన్నారు. మండలంలోని బోడిపాటివారిపల్లె పంచాయతీలో తన భర్త గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టి సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కర పత్రాలు పంపిణీ చేశాలు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మాజీ సర్పంచులు రవికుమార్‌నాయుడు, రామ చంద్రయ్య, గురుమూర్తి, లోకనాథం, వెంకటేశ్వర్, రవినాయుడు పాల్గొన్నారు.

చౌడేపల్లె: చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి మండలంలోని అమినిగుంట పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా గెలుపే లక్ష్యంగా సైనికుడిలా పనిచేయాలని సూచించారు. చల్లా రామచంద్రారెడ్డి గెలవగానే అరాచకం నుంచి పుంగనూరుకు విముక్తి కల్పిస్తామని తెలియజేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని, కమలం గుర్తుపై ఓట్లేసి రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ● దుర్గసముద్రం, వెంగళపల్లె తదితర పంచాయతీలో స్థానిక నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, విజయలక్ష్మి, ప్రదీప్‌రాజు, లక్ష్మీపతిరాజు, జంపాల శ్రీనివాసులు నాయుడు, గిరిరాజు, కల్యాణ్, హరిప్రసాద్, మహ్మద్‌గని, హమీద్‌ఖాన్, రామకృష్ణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, బీజేపీ నాయకులు నానబాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: పుంగనూరులో ప్రశాంతత, అభివృద్ధి కోసం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరి వీణారెడ్డి పిలుపునిచ్చారు. పుంగనూరు మండలం పాలెంపల్లె, సుగాలిమిట్ట, ఎంసీపల్లె గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు నెలకు రూ.1500 నగదు, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు అందిస్తామని తెలియజేశారు. అలాగే వృద్ధులకు రూ.4వేల పింఛను, దివ్యాంగులకు రూ.6వేల పింఛను, నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, గంగాధర్, కవిత, విజయకుమారి, మాజీ ఎంపీపీ రత్నమ్మ, కృష్ణానాయక్, మోహన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

హత్య, శవ రాజకీయాలు వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య

చౌడేపల్లె, మే2: హత్యలు, శవరాజకీయాలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టినవిద్య అని పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతనెల 30వ తేదీ రాత్రి బోయకొండ సమీపంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ సభ్యులు లడ్డూ రమణ బావమరిది రఘుపతినాయుడు ద్విచక్రవాహన ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడని తెలిపారు. అయితే టీడీపీ నాయకులే హత్యాయత్నానికి పాల్పడ్డారని వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడం సిగ్గు చేటన్నారు. అది జగన్ సొంత పత్రికలో ప్రచురించడం వైసీపీ దిగజారుడు శవ రాజకీయాలకు నిదర్శనమన్నారు. పోలీసులు మంత్రి పెద్దిరెడ్డి తొత్తులుగా వ్యవహరించడం తగదన్నారు. పుంగనూరుకు త్వరలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యం రానుందని తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి విజయం ఖాయమైందని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ఈవీఎంలను జాగ్రత్తగా నిర్వహించాలి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే2: ఈవీఎంలను జాగ్రత్తగా నిర్వహించాలని జేసీ, చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులు, రాజకీయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ పరిధిలో వున్న 226 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13న పోలింగ్ రోజు ఉపయోగించే ఈవీఎం మిషన్లకు బ్యాలెట్ యూనిట్‌లో గుర్తులతో కూడిన బ్యాలెట్ పేపర్‌ను, వీవీప్యాట్‌లో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను అమర్చాలని, వాటిని కంట్రోల్ యూనిట్‌లో అభ్యర్థుల సంఖ్యను సెట్ చేయడం జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ రోజు 23 టేబుల్స్ ఏర్పాటు చేసి ఒక్కో రౌండ్‌లో 12 రౌండ్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతాయన్నారు. పోలింగ్ రోజు ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి, ఆ స్లిప్పులను కవర్‌లో భద్రపరచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు, పలువురు అభ్యర్థులు, పార్టీ ఏజెంట్లు, బెల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

14న గిరింపేట గంగ జాతర చాటింపు

చిత్తూరు కల్చరల్: గిరింపేట నడివీధి గంగమ్మ జాతరకు ఈనెల 14న చాటింపు వేయనున్నట్లు ఉత్సవ నిర్వహకులు ఆర్.సి.చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 21, 22తేదీలలో జాతర నిర్వహించనున్నామని తెలియజేశారు.

సమస్య ఎక్కడుంటే అమర్ అక్కడుంటాడు


అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కేశవులు

పెద్దపంజాణి, మే 2: సమస్య ఎక్కడుంటే అమర్ అక్కడుంటాడని ఎవరూ ఎవరికీ భయపడాల్సిన పని లేదని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం పెద్దపంజాణి మండలం రాయలపేటలో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. పెనుబలకల, పెద కాప్పల్లె, జిట్టంవారిపల్లె నుంచి వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు విజయభాస్కర రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో పట్టణ మైనారిటీ మాజీ సదర్, జేఏసీ మండి యజమాని జాఫర్, పల మనేరు లారీ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిలాని వారి అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు ఆర్వీ.బాలాజీ, జిల్లా టీడీపీ మైనా రిటీ అధ్యక్షులు ఖాజాపీర్, ఆర్‌బీసీ కుట్టి, పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మార్కెట్ కమిటీ డైరెక్టర్

పలమనేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్, వి.కోట మండలం తోటకనుమ వైసీపీ పంచాయతీ కన్వీనర్ ఎంఆర్.వేణుగోపాల్‌రెడ్డి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వి.కోట మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, పాల్గొన్నారు.

వి.కోట: కుంబార్లపల్లె పంచాయతీ నుంచి సుమారు 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, నాయ కులు రాంబాబు, రామచంద్ర, దినేష్, రామూర్తి, బాలు ఉన్నారు.

గంగవరం: మండలంలోని గంగవరం పంచాయతీకి చెందిన వైసీపీ ఎంపీటీసీ కేశవులు మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

బైరెడ్డిపల్లె: మాజీ మంత్రి అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి మండలంలోని గౌనితిమ్మేపల్లెలో ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, టీడీపీ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. ● ఆలప్పల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడండి


రాజీవ్‌నగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్

కుప్పం, మే 2: చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడాలని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 7వవార్డు రాజీవ్‌కాలనీలో ఆయన గురువారం పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కుప్పం అభివృద్ధి ప్రదాత చంద్రబాబు అయితే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన సైకో ప్రభుత్వం వైసీపీదేనన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కుప్పం మళ్లీ అభివృద్ధి వైపు పయనిస్తుందని తెలియజేశారు.

టీడీపీ అధికారంలోకి వస్తే అందరికీ సంక్షేమం, అభివృద్ధి


సంపంగినగర్‌లో ప్రచారం చేస్తున్న కన్నన్, ముఖేశ్ తదితరులు

కుప్పం, మే 2: టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి సామాన్యులకు సైతం అందుబాటులోకి వస్తుందని ఆపార్టీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జి అప్పు ముఖేశ్, నాయకులు పి.గోపీనాథ్, డాక్టర్ వెంకటేశ్ అన్నారు. కొత్తపేటలోని 176వ బూత్ పరిధిలోని సంపంగినగర్‌లో గురువారం వారు పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో నియోజకవర్గంలో, ప్రత్యేకించి కుప్పంలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు.

టీడీపీలోకి 46 కుటుంబాలు



కుప్పం రూరల్, మే 2: కుప్పం మండలంలోని టి.సదుమూరు పంచాయతీ సింగారపురం గ్రామానికి చెందిన 46 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. మాజీ ఎంపీపీ సాంబశివం, క్లస్టర్ ఇన్‌చార్జి రామచంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరిన వీరికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు గ్రామాలు టీడీపీలో చేరుతుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోయిందన్నారు. సింగారపురం గ్రామానికి చెందిన రవి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సింగారపురం గ్రామానికి రైల్వే అండర్ బ్రిడ్జి, రోడ్లు, విద్యుత్తు దీపాలు, పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాణిపాకం వెంకటేశ్, కన్నన్, గోపీనాథ్, డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

రామకుప్పం, మే 2: రామకుప్పం మండలం రాజుపేట సమీపంలో ఎస్‌ఐ శివకుమార్ తమ సిబ్బందితో కలిసి గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వీర్నమలకు చెందిన కనకరాజు ద్విచక్రవాహనంలో 12 కర్ణాటక బీర్ బాటిళ్లను తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కనకరాజును అరెస్టు చేసి రిమాండుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

15 నుంచి కుప్పం గంగజాతర

కుప్పం, మే 2: కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు ఈ నెల 15వ తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. 7వ తేదీన జాతర చాటింపు జరుగుతుంది. అనంతరం ఈ నెల 15వ తేదీన వినాయకస్వామి ఉత్సవం, 16న ముత్తుమారెమ్మ ఉత్సవం, 17న అమ్మవారి శేషవాహన సేవ, మధ్యాహ్నం అన్నదానం, 18న సింహవాహన సేవ, అశ్వవాహన సేవ ఉత్సవాలు జరుగుతాయి. 20న అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 21న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 22న విశ్వరూప దర్శనం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

టెండర్లకు ఆహ్వానం

గంగజాతర మహోత్సవ ఏర్పాట్లకోసం అవసరమైన పనులకు దేవాదాయ ధర్మాదాయ శాఖ గ్రూప్ టెంపుల్స్ ఈవో టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 7వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 17 రోజులపాటు ఆలయం లోపల, బయటా పురవీధులలో చలువ పందిళ్లు, ఇతర అలంకరణల కోసం కొటేషన్లు ఆహ్వానిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. వారంలోగా కొటేషన్లను దేవస్థానం కార్యాలయంలో అందించాలని తెలియజేశారు.

పింఛన్ల కోసం పండుటాకుల పడిగాపులు


సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో బ్యాంకు వద్ద వేచి ఉన్న వృద్ధులు


కుప్పం, పుంగనూరుల్లోని ఇండియన్ బ్యాంకుల వద్ద, వృద్ధుల అవస్థలు

కుప్పం, మే 2: పెన్షన్లకోసం వృద్ధులు పడిగాపులు కాశారు. పెన్షన్లు బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పడంతో సుదూర ప్రాంతాలనుంచి వృద్ధులు ఆపసోపాలు పడుతూ కుప్పం చేరుకున్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో చాలామంది బ్యాంకుల వద్ద అవస్థలు పడ్డారు. కౌంటర్ల దగ్గర గుంపులు కట్టారు. అకౌంట్లలో పెన్షన్ నగదు జమ అయినదీ లేనిదీ తెలుసుకోవడానికే బ్యాంకు సిబ్బందికి గంటల సమయం పట్టింది. ఆపైన అకౌంట్ల నుంచి డ్రా చేసుకోవడానికి వృద్ధులు పడనిపాట్లు లేదు.

సోమల: మేడే బ్యాంకులకు సెలవుతో గురువారం స్థానిక బ్యాంకుల వద్దకు ఉదయమే పింఛన్ల కోసం వృద్ధులు చేరుకున్నారు. స్థానిక యూనియన్ బ్యాంకులో కొందరి ఖాతాలు లాక్ చేయడంతో పింఛన్ దారులు ఇబ్బందులు పడ్డారు. ఖాతాలు లేనివారు సచివాలయాల వద్దకు పరుగులు పెట్టారు. పింఛన్ దారులు గందరగోళంలో పడ్డారు.

సదుం: సామాజిక పింఛన్ల తీసుకునే వృద్ధులకు తిప్పలు తప్పలేదు. బ్యాంకు ఖాతాల్లో పింఛన్ల సొమ్ము జమ అవుతుందని లబ్ధిదారులు గురువారం స్థానిక బ్యాంకుల వద్ద గంటల తరబడి క్యూలో నిలుచున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కనీసం తాగేందుకు నీళ్లు దొరక్క నీరసించిపోయారు. ఆలస్యంగా బయోమెట్రిక్ పరికరాల ద్వారా వేలి ముద్రలు తీసుకుని పింఛన్ల నగదు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మొత్తం 5961 మందిలో 4310 మందికి వారి ఖాతాల్లో జమ కాగా, 1455 మందికి ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాజశేఖర బాబు తెలిపారు. ఒకే రోజులో 90 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

పలమనేరు: పలమనేరులో పెన్షన్ డబ్బులు డ్రాచేసుకొనేందుకు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకుల్లో రద్దీ పెరగడంతో బ్యాంకు వెలుపల పడిగాపులు కాశారు. పలమనేరు మున్సిపాలిటీలో మొత్తం 4694 మంది పెన్షనర్లు ఉన్నారు. వీరిలో 3215 మందికి వారి బ్యాంకు ఖాతాలకు జమచేశారు. మిగిలిన 1280 మందికి ఖాతాలు లేకపోవడంతో ఈనెల 1వ తేదీ సచివాలయ సిబ్బంది 1059 మందికి ఇంటివద్దకే వెళ్లి అందజేశారు. మిగిలిన 221 మందిలో గురువారం 163 మందికి అందజేశారు. 58 మంది ఇళ్లవద్ద అందు బాటులో లేకపోవడంతో వారికి ఇవ్వలేదు. గురువారం సాయంత్రానికి 93 శాతం మందికి పెన్షన్లు (బ్యాంకులో జమచేసిన పెన్షనర్లు కాక) అందజేశామని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

కల్లూరు: పులిచెర్ల మండలంలోని వృద్ధులు పింఛన్ల నగదు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. కల్లూరు ఇండియన్ బ్యాంకుల వద్దకు ఉదయమే చేరుకున్నారు. బ్యాంకు వద్ద క్యూలైన్లలో నిలబడలేక దుకాణాల ముందు కూర్చొని అవస్థలు పడ్డారు. ప్రభుత్వం నగదు అందించడంలో పూర్తిగా విఫలం కావడంతో లబ్ధిదారులు తల్లడిల్లిపోయారు.

పుంగనూరు రూరల్: పుంగనూరులో బ్యాంకులు పింఛనుదారులు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులతో కిక్కిరిశాయి. వృద్ధులు అధికసంఖ్యలో రావడంతో వసతులు లేక ఇక్కట్లకు గురయ్యారు. పుంగనూరు ఇండియన్ బ్యాంకు, స్టేట్‌బ్యాంకు తదితర బ్యాంకులు పెన్షనర్లతో కిటకిటలాడాయి. స్థలం చాలక ఆరుబయటే పడి గాపులు గాశారు. కాగా పుంగనూరు మండలంలో 8,365 మందిలో 80 మినహా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో మునిరెడ్డి తెలియజేశారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలోని ఇండియన్‌బ్యాంకు, గ్రామీణబ్యాంకు, మండలంలోని కొన్ని గ్రామాల్లో వున్న బ్యాంకుమిత్రకేంద్రాల వద్ద పింఛను కోసం చాలా సమయం వేచి చూడాల్సి వచ్చింది. ఎండలో ఇక్కట్లు పడ్డారు.


పలమనేరు గ్రామీణ బ్యాంకు ముందు, కడపనత్తంలో బ్యాంక్‌మిత్ర కేంద్రం వద్ద వేచివున్న వృద్ధులు ● సదుం ఇండియన్ బ్యాంకులో కిక్కిరిసిన పింఛనుదారులు ● కల్లూరు బ్యాంకు ముందు ఎండలో క్యూలైన్లో వేచి ఉన్న వృద్ధులు

14న గిరింపేట గంగమ్మజాతర చాటింపు

చిత్తూరు కల్చరల్: గిరింపేట నడివీధి గంగమ్మ జాతరకు ఈనెల 14న చాటింపు వేయనున్నట్లు ఉత్సవ నిర్వహకులు ఆర్.సి.చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 21, 22తేదీలలో జాతర నిర్వహించనున్నామని తెలియజేశారు.

గాలీవానకు నేలరాలిన మామిడి




నేలరాలిన మామిడి కాయలు, గాలికి నేలవాలిన వరిపంట

బంగారుపాళ్యం, మే 2: మండలంలో గురువారం ఉన్నట్టుండి గాలివానకు మండలంలోని పలు గ్రామాల రైతులకు చెందిన మామిడి, వరి పంట నేలరాలింది. టేకుమంద, మొగిలివారిపల్లె, పాలేరు, బోడబండ్ల, యరండ్లపల్లె, గుంతూరు, రాగిమానుపెంట గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన గాలి, వానకు కొంత మేరకు మామిడి నేలరాలింది. మొగలివారిపల్లెకు చెందిన బాలసుబ్రహ్మణ్యం నాయుడు, చిన్నబ్బలకు చెందిన కోతకొచ్చిన వరి నేలమట్టమైంది.

వెదురుకుప్పం: మండలంలోని వావిలిచేను గ్రామంలో అమరనాథ రెడ్డికి చెందిన కొబ్బరిచెట్టుపై పిడుగుపడడంతో చెట్టు కాలిపోయింది. ఆ చెట్టు పక్కనే సంఘమిత్ర సుబ్రహ్మణ్యం రెడ్డి ఇల్లు ఉంది. ఆ సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పెనుప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.

పింఛన్‌దారులతో చెలగాటం

ప్రభుత్వం తీరుతో బ్యాంకుల ముందు లబ్ధిదారులు పడిగాపులు ● అవస్థలు పడ్డ వృద్ధులు, దివ్యాంగులు




గంగాధరనెల్లూరు ఇండియన్‌బ్యాంక్ వద్ద వేచివున్న లబ్ధిదారులు, వెదురుకుప్పం ఇండియన్ బ్యాంకు వద్ద పింఛన్‌దారులు

గంగాధరనెల్లూరు, మే2: సామాజిక పింఛన్‌దారులతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతుండడంపై పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంగాధరనెల్లూరులో గురువారం ఇండియన్ బ్యాంక్ తెరవక ముందే పింఛన్‌దారులు డబ్బులుకోసం పడిగాపులుగాశారు. మే నెల పింఛన్లను కొందరికి ఇళ్లవద్దనే, మరికొందరికి వారి బ్యాంక్ అకౌంట్‌లలో డీబీటీ ద్వారా జమ చేస్తామని అధికారులు చెప్పడంతో ఆ డబ్బులు తీసుకోవడానికి గురువారం ఉదయం గంగాధరనెల్లూరులో ఇండియన్ బ్యాంక్ వద్దకు వందలాది మంది వచ్చేశారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున బ్యాంక్ అధికారులు షామియానా వేసి, తాగునీటి సౌకర్యం కల్పించి, లబ్ధిదారులకు పింఛన్ డబ్బు ఇచ్చేందుకు బిజినెస్ కరస్పాండెంట్(బీసీలు)లను పిలిపించుకుని, ఆ దిశగా చర్యలు చేపట్టారు. అయితే సచివాలయాల ఉద్యోగులచే ఆయా గ్రామాల్లో పింఛన్‌నిధులు పంపిణీ చేసి వుంటే లబ్ధి దారులకు ఇబ్బందులు ఏర్పడేవి కావని పింఛన్‌దారులు పేర్కొన్నారు. అదేవిధంగా తూగుండ్రం గ్రామీణబ్యాంక్ వద్ద పింఛన్‌దారులు నానాతంటాలు పడ్డారు.

పెనుమూరు : మే నెల పించను కొందరికి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వలన గురువారం బ్యాంకుల వద్ద జనం క్యూ కట్టారు. కొందరికి ఖాతాల్లో జమ అయినా మెయింటెనెన్స్ కింద కొంత కోత విధించడం, మరికొందరికి జమ కాకపోవడంతో వెనుతిరిగారు.

వెదురుకుప్పం : మే నెల పింఛన్ల పంపిణీపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. అవగాహన లోపంతో బ్యాంకుల వద్ద మండుటెండలో పండుటాకులకు పాట్లు తప్పలేదు. ఈ ఘటన వెదురుకుప్పం మండలంలో గురువారం జరిగింది. లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు.

యూటీఎఫ్ దాచూరి రామిరెడ్డికి ఘన నివాళి



బంగారుపాళ్యం, మే 2 : దాచూరి రామిరెడ్డి ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా మండల యూటీఎఫ్ నాయకులు గురువారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లాకార్యదర్శి సరిత, మండల అధ్యక్షులు మొగిలయ్య, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, భరత్, బాలాజీ పాల్గొన్నారు.

ఐరాల: యూటీఎఫ్ ఉద్యమ నిర్మాత దాచూరి రామిరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా గురువారం ఐరాల యూటీఎఫ్ నాయకులు స్థానిక ఎంఆర్సీ భవనం వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శులు సురేష్‌బాబు, లీలావతి మాట్లాడుతూ దాచూరి నిజాయితీ అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు అరుణ్‌కుమార్, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, జనార్ధన్, త్రివేణి, విజయలక్ష్మి, అమ్ములు, రోజారాణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ : కాంగ్రెస్

గుడిపాల, మే2: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టిక్కీ రాయల్ అన్నారు. గురువారం గుడిపాల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పెట్టుబడి మీద 50శాతం లాభంతో మద్దతు ధర కల్పిస్తామని, ఉపాధి హామీ కూలి రూ.400, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛన్‌ను మంజూరు చేస్తామన్నారు. ఇల్లులేని వారికి రూ.5లక్షలతో ఇల్లు కట్టిస్తామని, హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం



చిత్తూరు సిటీ, మే 2: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. బుధవారం టీడీపీ ఉమ్మడి మ్యానిఫెస్టోను విడుదల చేసిన సంగతి తెలిసిందే. గురువారం నగరంలోని 9వ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. నేతలు మాట్లాడుతూ ఉమ్మడి మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు మధు, ప్రభాకర్ నాయుడు, కుట్టి, అములు, సంతోష్ పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని కొండయ్యగారిఊరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో మహిళల కోసం డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చిన ఘనత టీడీపీదేనని మహిళలు కొనియాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ, నియోజకవర్గం అధ్యక్షురాలు రాధమ్మ, మండలఅధ్యక్షురాలు అనురాధ, మహిళలు పాల్గొన్నారు.

ఈవీఎంలను జాగ్రత్తగా నిర్వహించాలి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే2: ఈవీఎంలను జాగ్రత్తగా నిర్వహించాలని జేసీ, చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులు, రాజకీయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ పరిధిలో వున్న 226 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13న పోలింగ్ రోజు ఉపయోగించే ఈవీఎం మిషన్లకు బ్యాలెట్ యూనిట్‌లో గుర్తులతో కూడిన బ్యాలెట్ పేపర్‌ను, వీవీప్యాట్‌లో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను అమర్చాలని, వాటిని కంట్రోల్ యూనిట్‌లో అభ్యర్థుల సంఖ్యను సెట్ చేయడం జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ రోజు 23 టేబుల్స్ ఏర్పాటు చేసి ఒక్కో రౌండ్‌లో 12 రౌండ్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతాయన్నారు. పోలింగ్ రోజు ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి, ఆ స్లిప్పులను కవర్‌లో భద్రపరచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గుడిపాల, మే 2: నిరుపేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రతాప్ నాయుడు, గోవింద గౌడ్, వేణు గౌడ్, టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం యాదవ్, కిట్టు, గోపి పాల్గొన్నారు.

పోలీసు అబ్జర్వర్‌ను కలిసిన ఎస్పీ



చిత్తూరు, మే 2: ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బినోద్‌కుమార్‌ను ఎస్పీ మణికంఠ చందోలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పోలీసు అబ్జర్వర్ అమిత్‌రాజ్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో బినోద్‌కుమార్‌ను నియమించారు. స్థానిక పోలీసు అతిథి గృహానికి చేరుకున్న బినోద్‌కుమార్‌కు ఎస్పీ పుష్పగుచ్ఛం అందించారు.

ఎట్టకేలకు రథం తరలింపు



చిత్తూరు కల్చరల్, మే 2: నగరంలోని చర్చివీధిలో రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉన్న కోదండరామాలయ రథాన్ని ఎట్టకేలకు రంగవారి వీధికి తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్, ఎండోమెంట్ ఏసీ ప్రసన్నలక్ష్మిలు మీడియాకు తెలియజేశారు. చర్చివీధిలోని రథాన్ని సందర్శించిన వారు అదే వీధిలోని వాహనాల మండపంలోని ఎర్రగడ్డల మండిని ఖాళీ చేయించి అక్కడ రథాన్ని భద్రపరచనున్నట్లు వారు తెలియజేశారు.

టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శిగా బెల్లం సతీష్



చిత్తూరు సిటీ, మే2: టీడీపీ చిత్తూరు పార్లమెంటు కార్యదర్శిగా బెల్లం సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ నియామక పత్రాన్ని అందజేశారు. బెల్లం సతీష్ పార్టీలో అనేక పదవుల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.

సత్యసాయి బోధనలు మార్గదర్శకం

చిత్తూరు కల్చరల్, మే 2: భగవాన్ సత్యసాయి బాబా బోధనలు సర్వజనులకు మార్గదర్శకం అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకురాలు యశోద అన్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బుధవారం ఆమె భగవాన్ సత్యసాయి బోధనలు, సత్యసాయి ట్రస్టు సేవా కార్యక్రమాలపై భక్తులకు ఉపన్యాసం చేసారు. ఈ సందర్భంగా ఆమెను సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు ఎస్. మధుసూదనం, ఆర్. శేషనారాయణ, బి. పాండురంగం, గజేంద్రరెడ్డి, శ్రీకంఠయ్యలు సత్కరించారు.

గురజాలను గెలిపించుకుందాం

తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన





తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమనను ఆలింగనం చేసుకుంటున్న గురజాల, ప్రచారంలో సీకే బాబు, సీకే సాయి కృష్ణారెడ్డి, గురజాల ప్రతిమ తదితరులు

చిత్తూరుసిటీ, మే2: టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించుకుని చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిని సాధించుకుందామని తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన అన్నారు. గురువారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో గురజాల జగన్మోహన్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సతీష్ వేమనను గురజాల సన్మానించారు. సతీష్ వేమన తోపాటు పలువురు ఎన్నారైలు గురజాలను కలిశారు.

11 వ డివిజన్ పరిధిలో : నగరంలోని 11వ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ భార్య ప్రతిమ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థిగా ప్రసాదరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

40వ డివిజన్ పరిధిలో : మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆయన కుమారుడు సీకే సాయి కృష్ణారెడ్డి 40వ డివిజన్ పరిధిలోని కైలాసపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుమారు 150 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరిని సీకే బాబు పార్టీ కండువాకప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం స్థానిక ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించి టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చెంగల్రాయనాయుడు, మాజీ కార్పొరేటర్ మురుగ, వసంతమ్మ, జనా, సేటు, దుర్గా, నరేష్, దాసు, విజయ్, సతీష్ శాంతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల : గుడిపాల వైసీపీ ఎంపీటీసీ గురువారం నారా లోకేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి టీడీపీలో చేరారు.

ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాల ప్రచారం



ఎర్రమరాజుపల్లెలో టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న థామస్

కార్వేటినగరం, మే 2: మండలంలోని ఎర్రమరాజుపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ కూటమి శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ రెండు ఓట్లూ సైకిల్ గుర్తుకు వేయాలని డాక్టర్ థామస్ ఓటర్లను కోరారు. అనంతరం టీడీపీలో చేరిన ఆరుగురికి పార్టీ కండువాలు కప్పారు.

వెదురుకుప్పం : ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ తమ్ముడు నిధి గురువారం అగ్గిచేనుపల్లె పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను అందించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు సైకిల్ గుర్తుపై ఓట్లను వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బండి విష్ణువర్ధన్‌రెడ్డి, కోలా జయచంద్ర, పోటుగారి గంగయ్య, కార్తీక్, వి.మోహన్‌మురళి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : మెదవాడ పంచాయతీ గ్రామాల్లో గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ గురించి వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలనిలని బోడపాటి లోకనాథం నాయుడు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నీరంజన్‌రెడ్డి, పుల్లూరుబాబు, జలంధర్ నాయుడు, డిల్లీ, గజేంద్ర, మణి, ఎన్. కుమార్, హేమాద్రి యాదవ్, బాబు నాయుడు, గురునాథం, బాలాజీ నాయుడు, రవి, తయ్యూరు లోకేష్, తయ్యూరు నాగరాజు, జనసేన నాయకులు చందు, చార్లస్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని గంగమాంబపురంలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ కుమారుడు రాహుల్ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. తన తండ్రి థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావులను గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు, కార్యక్రమంలో టీడీపీ నేతలు భీమినేని చిట్టిబాబు నాయుడు, వాసునాయుడు, చిరంజీవి, ఏకుమల్లై, బాబు, హరిరాజు, విజయ్‌కుమార్, అరుళ్‌నాథన్ పాల్గొన్నారు.

పెనుమూరు : ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటువేసి తన భర్త థామస్‌ను గెలిపించండంటూ ఆయన సతీమణి గీతారెడ్డి కోరారు. గురువారం నంజరపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథనాయుడు ఆధ్వర్యంలో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హరిబాబు నాయుడు, భాస్కర్, సురేష్‌చౌదరి, పరమేశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌ఎస్ నాయుడు, యువరాజులు నాయుడు, పంగుళూరి కిషోర్, శశినాయుడు, జనసేన, బీజేపీ అధ్యక్షులు శ్రీనివాసులు, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

భవిష్యత్ బాగుండాలంటే టీడీపీ గెలవాలి : గాలి భాను



తడుకుపేటలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

నగరి మే2: రాష్ట్రంలో ప్రజల భవిష్యత్ బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. గురువారం నగరి మండలంలోని ఏడుగట్లు, ముడిపల్లి, మీరాసాహెబ్‌పాలెం, తడుకుపేట, వీకేఆర్‌పురం, ఓజీ కుప్పం, బీరకుప్పం గ్రామాల్లో భానుప్రకాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీకి ఓట్లు వేస్తే నదులు, కొండలు కరిగిపోతాయని, అక్రమాలను, అవినీతిని ప్రశ్నిస్తే కేసులు పెడతారని ఆయన విమర్శించారు. హిట్లర్‌లాగా అణచివేత ధోరణి అవలంభిస్తున్న జగన్‌రెడ్డిని, రోజాను ఇంటికి సాగనంపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామునాయుడు, మునిరత్నంనాయుడు మీరా, బాలాజీ, సురేష్‌నాయుడు, ఐవీనాయుడు, చిత్తూరు బాబునాయుడు, దేశమ్మ గుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నారాయణస్వామి నాయుడు, కపిల్, ధన, చంద్ర, నాగరాజు లక్ష్మి, దేవా, వరాలు భూపతి, నాగరాజు, బాబురెడ్డి, కన్నివేలు, గోవిందస్వామి పలువురు నాయకులు పాల్గొన్నారు.

వడమాలపేట : అక్రమాలకు పాల్పడుతూ ప్రజలకు భారమైన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎన్‌డీఏ నగరి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ కోరారు. గురువారం ఆయన పత్తిపుత్తూరు ఆదిఆంధ్రవాడలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకిని రావడంతోనే నిరుపేదల భవిష్యత్తు మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సర్పంచుల ఆధ్వర్యంలో పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తామని చెప్పారు.

నన్ను గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తా

పూతలపట్టు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న మురళీమోహన్

పూతలపట్టు, మే2: తెలుగుదేశం పార్టీని ఆదరించి తనను గెలిపిస్తే మీకు సేవకుడిగా పనిచేస్తానని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ మోహన్ అన్నారు. గురువారం ఆయన ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుతో కలిసి మండలంలోని పి.కొత్తకోట, పేటమిట్ట పంచాయతీల్లో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో బూటకమని, ఆ మ్యానిఫెస్టోను నమ్మరాదన్నారు. యువతకు ఉపాధి రావాలంటే తెలుగుదేశం పార్టీకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యువరాజులు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, గిరిధర్ బాబు, ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, గాలి దిలీప్ కుమార్, మొరార్జీ, బాబురావు, మురళీ మోహన్, సంపత్ నాయుడు, గల్లా రాధాకృష్ణమ నాయుడు, దగ్గుమళ్ళ సుధాకర్, ప్రతాపనేని చంద్రమౌళి, ఎల్బీఐ లోకేష్ రెడ్డి, రామ్మూర్తి రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన మురళీ మోహన్, దగ్గమళ్ల ప్రసాద్‌రావులను ఆదరించాలని పలు గ్రామాల్లో గురువారం టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జంబువారిపల్లె, శాంతినగర్, ఎన్‌పీ నగర్, మాధవనగర్, దండువారిపల్లె గ్రామాల్లో ఇంటింటి తిరిగి సూపర్‌సిక్స్ కరపత్రాలను పంచిపెట్టారు. అలాగే టీడీపీ అధికారంలోకి రావాలని తగ్గువారిపల్లెలోని మారెమ్మ ఆలయం వద్ద రెండు కేజీలకర్పూరం, 101 టెంకాయలను మండల అధ్యక్షులు ఎన్‌పీ జయప్రకాష్‌నాయుడుల ఆధ్వర్యంలో సమర్పించారు. నలగాంపల్లె గ్రామంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ చిన్నయ్య ఆధ్వర్యంలో కరపత్రాలను పంచిపెటారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్రనాయుడు, ధరణీ, కోకా ప్రకాష్‌నాయుడు, కమలనాధరెడ్డి, జనార్ధన్‌గౌడ్‌లు ఉన్నారు.

చిత్తూరులో టీడీపీ జెండా ఎగురవేస్తాం

సీఆర్ రాజన్, చంద్రప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్ రాజన్, చంద్రప్రకాష్ తదితరులు

చిత్తూరు సిటీ, మే 2: చిత్తూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో అత్యధిక మెజారిటీ సాధించి టీడీపీ జెండా ఎగురవేస్తామని పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని ఒక ఎంపీ, ఏడు ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు తమ శక్తివంచనలేకుండా కృషిచేస్తామని చెప్పారు. పార్టీలో అందరినీ సమన్వయం చేసుకుని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ నేతలు త్యాగరాజన్, మోహన్‌రాజ్, శశికర్ బాబు, సునీల్‌కుమార్ చౌదరి, దేవరాజులు నాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచే పింఛన్ రూ.4 వేలు

చిత్తూరు రూరల్ : టీడీపీ అధికారంలో వచ్చిన వెంటనే ఏప్రిల్ నెల నుంచే వృద్ధులకు రూ.4వేలు పింఛన్లు అందిస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ అన్నారు. గురువారం చిత్తూరు రూరల్ మండలంలోని ముత్తుకూరు. పాలూరు పంచాయతీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రోడ్డు, గ్రామాల్లో కాలువలు, నీటి ట్యాంకులు నిర్మించింది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గురజాల జగన్మోహన్‌ను, దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లకు వివరించారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, మైఖేల్, మోహన్‌నాయుడు, బాబు నాయుడు, చిట్టిబాబు నాయుడు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీ.ఆర్.రాజన్, చంద్రప్రకాష్‌లకు సన్మానం



గంగాధరనెల్లూరు, మే 2: చంద్రగిరి ఎన్నికల కోఆర్డినేటర్లుగా చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్‌ను నియమించిన విషయం తెలిసిందే. గురువారం చిత్తూరులో వారికి జీడీనెల్లూరు మండలానికి టీడీపీ నేతలు శాలువాలు కప్పి సన్మానం చేశారు. పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నరసింహులునాయుడు, పాతపాళ్యం మాజీ సర్పంచ్ వెంకటేష్‌నాయుడు, నేతలు గంగమ్మగుడి జయచంద్రనాయుడు, చిత్తూరు టైల్స్‌షాప్ యాజమాని రవీంద్రనాయుడు పాల్గొన్నారు.